నేటి నుంచి మావుళ్ళమ్మ పునఃదర్శనం

భీమవరం టౌన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మావుళ్ళమ్మ నిజరూప దర్శనం బుధవారం పునః ప్రారంభం కానుంది. ఉదయం 10.30 గంటలకు ఆలయ ప్రధానార్చకుడు మద్దిరాల మల్లికార్జునశర్మ ఆధ్వర్యంలో జంధ్యాల గంగాధర్‌శర్మ కళాన్యాసం పూజలు చేసి అమ్మవారి విగ్రహంలో కళలను ప్రతిష్ఠించి, పూజలు నిర్వహిస్తారు. అనంతరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజ నేయులు ఆలయాన్ని తెరవడం ద్వారా పునఃదర్శనం కల్పించనున్నారు. అమ్మవారి విగ్రహానికి రంగులు వేసే నిమిత్తం ఈ నెల 11వ తేదీ నుంచి దర్శనాలు నిలిపివేసిన సంగతి తెలిసిందే.

బీఎల్‌వోలకు గౌరవ వేతనం విడుదల

భీమవరం టౌన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధులు నిర్వహిస్తున్న బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్‌వో)లకు గౌరవ వేతనం విడుదలైంది. మూడేళ్లుగా వీటి కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇతర ప్రాంతాలకు వలస వెళ్ళిన, చనిపోయిన ఓట్ల తొలగింపు, కొత్త ఓట్ల చేర్పులు, మార్పులు తదితర విధులను నిర్వహించారు. ఈ 2021 నుంచి 2024 వరకు పనులను చేపట్టారు. మూడేళ్లుగా వీరికి గౌరవ వేతనం ఇవ్వలేదు. దీనిపై రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి దృష్టికి, ఆర్థిక మంత్రి దృష్టికి పలుమార్లు తీసుకుని వెళ్లింది. దీనికి కూటమి ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. మంగళవారం జిల్లాలోని 1461 మంది బీఎల్‌వోలకు కోటీ 80 లక్షలు విడుదల చేసింది. మూడేళ్ల కాలానికి ఒక్కో బీఎల్‌వోకు 12 వేల 750 రూపాయల గౌరవ వేతనం అందనుంది. ఈ నిధులు విడుదల చేసినందుకు గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్రరాజు, ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలనాయుడు హర్షం వ్యక్తం చేస్తూ సీఎం చంద్రబాబు నాయుడు, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి కృతజ్ఞతలు తెలిపారు.

అన్న క్యాంటీన్‌ల మరమ్మతులకు నిధులు

భీమవరం టౌన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అన్న క్యాంటీన్‌ల మరమ్మతులకు నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. భీమవరంలో మూడు, తణుకు, తాడేపలిగూడెం, పాలకొల్లు పట్టణాల్లో ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయి. వీటికి అదనంగా తాడేపల్లిగూడెం మూడు, తణుకు ఒకటి, నరసాపురం ఒక క్యాంటీన్‌కు సంబంధించి నిధులు విడుదల చేశారు. తాడేపల్లిగూడెం తహసీల్దార్ కార్యాలయం వద్ద అన్న క్యాంటీన్‌కు రూ.8,67,159, బీఆర్ మార్కెట్ వద్ద క్యాంటీన్‌కు రూ.6,70,457, ఆటోస్టాండ్ వద్ద క్యాంటీన్‌కు రూ.7,54,547, తణుకు మునిసిపాల్టీలోని క్యాంటీన్‌కు తొమ్మిది లక్షలు, నరసాపురం క్యాంటీన్‌కు రూ.9,98,484 విడుదల చేశారు.

అభివృద్ధి పనులపై కలెక్టర్ నాగరాణి సమీక్ష

భీమవరం రూరల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): కళాశాలలు, పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో చేపట్టిన మౌలిక వసతుల అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో పంచాయతీరాజ్, సోషల్ వెల్ఫేర్, ఈడబ్ల్యుఐడీసీ, సమగ్ర శిక్ష ఇంజనీరింగ్ అధికారులతో సమావేశమై ఆయా శాఖల పరిధిలో జరుగుచున్న ప్రభుత్వ విద్యా సంస్థల పనులపై సమీక్షించారు. 'మన బడి- మన భవిష్యత్తు' పథకం కింద పాలకొల్లు రూరల్, భీమవరం రూరల్, కాళ్ళ, అత్తిలి, యలమంచిలి మండలాల్లోని పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించారు. జిల్లాలో 23 సాంఘిక సంక్షేమ వసతి గృహాల మరమ్మతులు, మౌలిక వసతులు అభివృద్ధికి రూ.129 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి కె.శ్రీనివాసరావు, జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి నాగేశ్వరరావు, ఈడబ్ల్యుఐడీసీ ఈఈ బి.రంగనాథ స్వామి, సమగ్ర శిక్ష డిప్యూటీ డీఈ బి.శక్తేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.







జిల్లావ్యాప్తంగా క్రిస్మస్ సంబరాలు అంబరాన్నంటాయి. క్రైస్తవులు ఊరూరా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చిన్నారులు దేవుడి పాటలు ఆలపించారు. క్రీస్తు జన్మదిన శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

భీమవరం రూపాంతర దేవాలయంలో ఎమ్మెల్యే అంజిబాబుకు కేకు తినిపిస్తున్న మండలి చైర్మన్ మోషేన్‌రాజు

పాలకొల్లు చర్చిలో పాటలు పాడుతున్న చిన్నారులు

6



మెర్రీ క్రిస్మస్

భీమవరంలో విద్యుత్ కాంతుల్లో చర్చి

టిడ్కో ఇళ్లకు వైసీపీ శాపాలు



భీమవరంలో టిడ్కో ఇళ్లు

ఐదేళ్లు పట్టించుకోని గత సర్కార్.. లబ్ధిదారులకు మిగిలిన కష్టాలు

- ఫ్లాట్లలోకి వెళ్లేందుకు ఆసక్తి చూపని వారెందరో
- మధ్యలోనే నిలిచిన నిర్మాణాలు
- బకాయిలు చెల్లించకపోవడంతో శ్రద్ధ చూపని ఏజన్సీలు

భీమవరం/పాలకొల్లు అర్బన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్మిస్తున్న ఏపీ టిడ్కో ఇళ్లలో సమస్యలు తిష్టవేశాయి. 2014-19 మధ్య కాలంలో తెలుగుదేశం ప్రభుత్వం నిర్మాణాలు చేపట్టిందని గడచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఈ ఇళ్లను పట్టించుకోలేదు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకుండా నస పెట్టింది. పెండింగ్‌లో వున్న నిర్మాణాలను పట్టించుకోలేదు. పూర్తయి న ఇళ్లను గాలికి వదిలేయడంతో మరమ్మతుల కు లోనయ్యాయి. వాటిని అలాగే లబ్ధిదారులకు కట్టబెట్టింది. నిర్వహణ లేకపోవడంతో లీకేజీలు వెంటాడుతున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. రుణాలిచ్చిన బ్యాంకులు లబ్ధిదారులను డిఫాల్టర్ల జాబితాలో చేరుస్తున్నాయి. నిర్మాణాలు నిలిచిపోయాయి. జిల్లాలో మొదటి విడతగా భీమవరం, పాలకొల్లు, తాడేపల్లిగూడెం పట్టణాల్లో 20,512 టిడ్కో ఇళ్లు కేటాయించి 8,000 ఇళ్లను టీడీపీ ప్రభుత్వం పూర్తిచేసింది. బ్యాంకు రుణాలు ఇప్పించి, ఇళ్లను వారికి అప్పగించేందుకు చర్యలు తీసుకుంది. ఈ క్రమంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. బ్యాంకు రుణాలు నిలిచిపోయాయి. లబ్ధిదారులతో బ్యాంకులు కుదుర్చుకున్న ఒప్పందాలను రద్దు చేసింది. కొత్తగా సర్వే చేపట్టి భీమవరం, తాడేపల్లిగూడెంలో వెయ్యి మంది లబ్ధిదారులను జాబితా నుంచి తొలగించింది. అప్పటికే వారి నుంచి ఇళ్ల కేటగిరీని బట్టి రూ.50 వేల నుంచి లక్ష వరకు వసూలు చేశారు. కాని, ఆ సొమ్ములు తిరిగి ఇవ్వలేదు. అనర్హులుగా తేలిన లబ్ధిదారులు రెండు రకాలుగా నష్టపోయారు.



కిచెన్‌లోకి మురుగునీరు

కొత్త చిక్కులు

వైసీపీ ప్రభుత్వంలో లబ్ధిదారులకు కొత్త రుణాలు మంజూరు చేశారు. ఇళ్లు అప్పగించకుండానే రుణాలు కల్పించారు. ఆ సొమ్మును ప్రభుత్వం తమ ఖాతాలో జమ చేసుకుంది. కాంట్రాక్ట్ ఏజన్సీకి ఇవ్వలేదు. ఇళ్లు అప్పగించే వరకు రుణాలకు సంబంధించి వాయిదాలు చెల్లించాల్సిన అవసరం లేదంటూ ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇప్పుడు వాయిదాలు చెల్లించక పోవడంతో బ్యాంకులు లబ్ధిదారులను డిఫాల్టర్ జాబితాలో చేరుస్తున్నాయి. ఇది సిబిల్ స్కోర్‌పై ప్రభావం పడుతోంది. ఇతర రుణాలు ఇవ్వాల న్నా బ్యాంకులు ససేమిరా అంటున్నాయి. టిడ్కో ఇళ్ల రుణంలో డిఫాల్టర్ అయ్యారంటూ తేల్చి చెపుతున్నాయి. లబ్ధిదారులు ఇళ్లు పొందలేక పోయారు. మరోవైపు పరపతిని కోల్పోయారు. వైసీపీ హయాంలో చేసిన తప్పిదాలతో ఇప్పుడు లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు.

వెళ్లాలంటేనే భయం

ఇళ్లల్లోకి వెళ్లాలన్నా లబ్ధిదారులు బెంబేలెత్తిపోతున్నారు. వెళ్లినవారు పడుతున్న ఇబ్బందులను చూసి కొత్త వారు సాహసం చేయలేక పోతున్నారు. ఈ మూడు పట్టణాల్లో వైసీపీ హయాంలోనే 8,500 ఇళ్లు అప్పగించారు. అందులో 5,000 మంది మాత్రమే ఆ ఇళ్లలోకి వెళ్లారు. వారు నానా ఇబ్బందులు పడుతున్నారు. సింక్‌లు కారిపోతున్నాయి. పైప్ లైన్‌ల లీకేజీ సమస్యలు వెంటాడుతున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా దెబ్బతింది. సింక్‌ల నుంచి వాడకపు నీరు ఎగదన్నుతోంది. వీటిని కూడా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. కేవలం టిడ్కో ఇళ్లకు సొంత రంగులు వేసుకోవడానికే ఆసక్తి చూపింది. కాంట్రాక్టర్‌కు రూ.150 కోట్లు పెండింగ్‌లో పెట్టింది. ఇవన్నీ లబ్ధిదారుల పేరిట శాపంగా మారాయి. ఎన్నికల ముందు హడావిడిగా మూడు పట్టణాల్లోనూ మరో 3,000 ఇళ్లకు పట్టాలు ఇచ్చేశారు. కానీ, లబ్ధిదా రులకు ఇళ్లు అప్పగించలేదు. ఇంటి లోపల పనులను పూర్తి చేయకుండానే పట్టాలు ఇచ్చి లబ్ధిదారులను మోసం చేసింది. ఇప్పటికీ లీకేజీ సమస్యలతో లబ్ధిదారులు వెళ్లలేకపోతున్నారు.



డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం

నిలిచిన నిర్మాణాలు

తొలి విడత నిర్మాణం చేపట్టిన మూడు పట్టణాల్లోనూ ఇంకా 9,500 ఇళ్లు నిర్మించాలి. తెలుగుదేశం హయాంలో అవి కూడా 75 శాతం పూర్తిచేశారు. వాటిని వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. సిమెంట్ గోడలతో అవి దర్శనమిస్తున్నాయి. వాటిని పూర్తి చేసి లబ్ధిదారులకు అప్ప గించాలి. కూటమి ప్రభుత్వం టిడ్కో ఇళ్లపై దృష్టి పెట్టింది. త్వరలోనే భీమవరం, తాడేపల్లిగూడెంలో 2,000 ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వాలన్న ఆలోచనతో ఉంది. బకాయిల కారణంగా నిర్మాణంపై ఏజన్సీ శ్రద్ధ చూపడం లేదు.



భీమవరంలో పగిలిన పైపులు



అసంపూర్తి నిర్మాణాలు

ఇళ్లల్లోకి మురుగునీరు



డ్రైనేజీ పైపులు బ్లాక్ అయ్యి మురుగునీరు ఇంటిలోకి వచ్చేస్తోంది. దీనివల్ల ఇబ్బంది పడుతున్నాం. ఇళ్లలో నాణ్యత అంతగా లేదు. అధికారులు వచ్చి సమస్యను పరిష్కరించాలి. నీటిని బయటకు రాకుండా చర్యలు తీసుకోవాలి. నీరు నిల్వ ఉండటం వల్ల దుర్గంధం వస్తోంది.

- జె.అచ్యుతరావు, భీమవరం

రెండో విడత అధోగతే..

రెండో విడతలో తణుకుకు 1,250 ఇళ్లు కేటాయించారు. సర్పాంజీ పల్లాంజీ సంస్థ నిర్మాణాన్ని చేపట్టింది. టీడీపీ హయాంలోనే వాటిని కేటాయించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని నిలిపివేసింది. పునాది దశలోనే ఇళ్లు నిర్మాణం నిలిచింది. నిర్మాణ ఏజన్సీకి బిల్లులు ఇవ్వకపోవడంతో నిర్మాణం ముందుకు సాగడం లేదు. బకాయిలే ప్రధాన సమస్యగా మారింది. తొలి విడత టిడ్కో ఇళ్లలో డ్రైనేజీ వ్యవస్థ, సౌకర్యాలను కల్పించాలి. పైప్‌లైన్‌ల ద్వారా మంచినీటి సరఫరా చేయాలి.

పాలకొల్లు వాసుల ఆవేదన



డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం

పాలకొల్లులో 6,154 మందికి గృహాలు నిర్మించినప్పటికీ 2,560 మందికి మాత్రమే స్వాధీనం చేశారు. మిగిలిన ఇళ్ళకు ప్లంబింగ్, పెయింటింగ్, ఇంటీరియల్ పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం నివసిస్తున్న వారు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. పైపులైన్లు లీకేజీ వల్ల సెప్టిక్ ట్యాంక్‌కు వెళ్లే లైన్లు దెబ్బ తిని దుర్వాసనతోపాటు, మురుగు నీరు ఇళ్ళ పరిసరాల్లో చేరుతోంది. పైపులైన్లు సరిపడా ఏర్పాటు చేయలేదు. సెప్టిక్ ట్యాంక్‌లోకి వెళ్లే మల విసర్జన పైపులైన్ లీకేజీ కావడంతో తాము కాపురాలు చేయలేకపోతున్నామని కాలనీ వాసులు వాపోతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు, చిత్రంలో ఎమ్మెల్యే బొలిశెట్టి, టీడీపీ ఇన్‌చార్జ్ వలవల తదితరులు

గోదావరి డెల్టాకు పూర్వ వైభవం

తాడేపల్లిగూడెం రూరల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి):గోదావరి డెల్టాకు పూర్వ వైభవం తీసుకొస్తానని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లిలో మంగళవారం స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో జిల్లాలో 27 గ్రామాలకు రూ.1.67 కోట్ల విలువైన ట్రాక్టర్లను ప్రారంభించి మాట్లాడారు. నీటిపారుదల శాఖ మంత్రిగా గోదావరి డెల్టాను సమూలంగా ఆధునికీకరిస్తా. పరిసరాల పరిశుభ్రతకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. కోట్లాది రూపాయలు వెచ్చించి గ్రామాలకు ట్రాక్టర్‌లు అందిస్తోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో వారి మద్దతుతో గెలిచిన సర్పంచ్‌లే సిగ్గుపడేలా పాలన సాగించారు. ఫిల్టర్ బెడ్‌లు మార్చుకోలేక, చెత్త రిక్షాల వారికి జీతాలు చెల్లించలేక అవస్థలు పడ్డారు. కూటమి ప్రభుత్వం పల్లెలకు పునరుజ్జీవం సాధించే దిశగా పాలన ముందుకు సాగుతోంది' అని అన్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని చెత్త మయంగా తయారు చేసిన ఘనత జగన్‌ది అయితే.. చెత్త నుంచి సుందర గ్రామాలుగా మారుస్తున్నది కూటమి ప్రభుత్వం అని అన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వలవల బాబ్జి, బీజేపీ కన్వీనర్ ఈతకోట తాతాజి, జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి, డీపీవో ఎం.అరుణశ్రీ, ఆర్డీవో ఖతీఫ్ కౌసర్ భనో, సర్పంచ్ పోతుల అన్నవరం, టీడీపీ మండల అధ్యక్షుడు పరిమి రవికుమార్, ఐసర్ ట్రాక్టర్ కంపెనీ డీలర్ కూచిపూడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అల్పపీడనం గుబులు

జిల్లావ్యాప్తంగా చిరు జల్లులు.. ఆందోళనలో అన్నదాతలు

మొగల్తూరు/ఉండి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారడంతో ఐదు రోజులుగా చిరుజల్లులతో కూడిన ఈదురుగాలులు, చలిగాలులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఆగి, ఆగి కురుస్తున్న కొద్దిపాటి వర్షాలతో దాళ్వా కోసం వేసిన నారుమడులపై రైతులు ఆందోళన చెందుతున్నారు. సార్వాలో ఒబ్బిడి చేసిన ధాన్యాన్ని తడిచిపోకుండా బరకాలు కప్పి జాగ్రత్త చేస్తున్నారు. ముందస్తుగా చేపట్టిన సార్వా సాగు కోతలు పూర్తికావడంతో దాళ్వాకు సన్నద్ధమవుతున్నారు. మొగల్తూరు, రామన్నపాలెం, కేపీ పాలెం, పేరుపాలెం గ్రామాల్లో సుమారు 50 ఎకరాల్లో ముందస్తు దాళ్వాకు సంబంధించి నాట్లు వేసుకోవడం పూర్తయ్యిందని వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్ తెలిపారు. వాతావరణ మార్పులతో భారీ వర్షాలు కురిస్తే దాళ్వా నారుమడులు మునిగి కుళ్లిపోతాయనే ఆందోళనలో రైతులు ఉన్నారు. మరో వైపు ఇటుకలు తడవకుండా బరకాలు, తాటాకులు కప్పి గాలికి ఎగిరిపోకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. మొగల్తూరు నుంచి కొత్తపాలెం వెళ్లే ఆర్ అండ్‌బీ రహదారి అధ్వానంగా ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలకు రోడ్లపై గోతుల్లో నీరు నిలిచిపోవడంతో జారిపడే ప్రమాదం ఉందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఉండిలో ధాన్యంను ఆరబెట్టుకోవడం పనులను రైతులు చేస్తున్నారు. ఎస్ఆర్పీ అగ్రహారంలోని ట్రాక్టర్లులో పట్టుబడి చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్నారు. ఈ నెల 26న మరో తుఫాన్ ఉందన్న వాతావరణ హెచ్చరికలతో రైతులు గాబరాపడుతున్నారు. మరో వారం రోజులు వాతావరణం అనుకూలిస్తే సార్వా పంట ఒబ్బిడి చేసుకోవచ్చునని రైతులు అంటున్నారు.



మొగల్తూరులో దాళ్వా సాగుకు నారుమడి

రొయ్యల చెరువులకు ఇబ్బంది

అల్పపీడన ద్రోణి కారణంగా తీవ్రంగా వీస్తున్న చలిగాలులకు పశ్చిమ గోదావరి జిల్లాలోని రొయ్యల చెరువుల్లో ఆక్సిజన్ పడిపోతోంది. ఈ కారణంగా రొయ్యలు చనిపోయే ప్రమాదం ఉందని అవకాశం ఉందని సంబంధిత రైతులు చెబుతున్నారు. నిరంతరం ఏరియేటర్లను తిప్పాల్సి వస్తోంది. ఆక్సిజన్ తగ్గితే రొయ్యలను కాపాడుకోవడానికి మందులను కొనుగోలు చేసి రొయ్యల చెరువుల వద్ద సిద్ధంగా ఉంచుకున్నారు. వాతావరణం అనుకూలంగా లేక కొందరు రైతులు చిన్న సైజు చేపలను పట్టుకోవడంతో పెట్టుబడులు రాలేదని వాపోతున్నారు.



వైద్యశాఖకు అవినీతి రోగం

- ఐదు కీలక విభాగాలకు ఒక్కరే దిక్కు!
- జిల్లా అధికారి మిలాఖత్‌పై ప్రచారం
- వైద్యాధికారులపై వేధింపులు
- ఉద్యోగులకు అక్రమ డిప్యుటేషన్లు

ప్రేమించలేదని.. యువకుడి ఆత్మహత్య

బాలికను పెళ్లి చేసుకున్న యువకుడి అరెస్టు

పనిచేస్తున్న ఫైనాన్స్ కంపెనీకే టోకరా

7లో..


పెనుగొండ పాఠశాలలో క్రిస్మస్ వేడుకల్లో చిన్నారులు


ఏలూరు రూరల్‌లో శాంతాక్లాజ్ వేషధారణలో ఆకట్టుకున్న చిన్నారులు


పాలకొల్లు పట్టణంలో చిన్నారుల సందడి


జంగారెడ్డిగూడెం పట్టణంలో బొమ్మ శాంతాక్లాజులు


ఏలూరు మన్నా చర్చిలో కొవ్వొత్తులతో ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు

శాంతికి చిహ్నం క్రిస్మస్



• వేడుకలకు ముస్తాబైన చర్చిలు • విద్యుత్ వెలుగుల నక్షత్రాలు • ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు • చిన్నారి శాంతాక్లాజ్‌ల సందడి



క్రీస్తు జీవితం ఆదర్శప్రాయం

ప్రముఖుల శుభాకాంక్షలు

త్యాగం, ప్రేమ, కరుణ గొప్పతనాన్ని ఏసు క్రీస్తు తన బోధనలు ద్వారా విశ్వ మానవాళికి అందించారని పలువురు ప్రముఖులు అన్నారు. క్రీస్తు జీవితం ఆదర్శప్రాయమని ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. పశ్చిమ కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఏలూరు జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్, ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్, ఎమ్మెల్యే బడేటి చంటి, చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్, పెదవేగి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

ఏలూరు క్రైం, టూటౌన్ / చింతలపూడి / పెదవేగి / భీమవరం టౌన్


ఏలూరు టూటౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏసుక్రీస్తు జన్మదినమైన క్రిస్మస్ పండుగ క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. క్రీస్తు జన్మించి 2వేల సంవత్సరాలు అయినప్పటికి కరుణామయుడిగా ఆరాధనలు అందుకుంటున్నారు. రెండు వేల సంవత్సరాల క్రితం రోమ్ సామ్రాజ్యాధినేత అగస్టస్ సీజర్ తన రాజ్యంలో జనాభా ఎంతున్నారో తెలుసుకోవాలనుకున్నారు. ప్రజలందరిని డిసెంబరు 25లోపు స్వగ్రామాలకు వెళ్లాలని అజ్ఞాపించారు. అదే సమయంలో నజరేతు అనే ఊరిలో మరియమ్మ, యోసేబులకు ప్రదానం అయ్యింది. అప్పటికి పెళ్లి కాలేదు. ఈ లోపు మరియమ్మకు కలలో దేవదూత గాబ్రియేల్ కనిపించి నేడు దేవుని అనుగ్రహం పొందావు. పరిశుద్ధ ఆత్మతో గర్భం దాల్చి కుమారుడిని కంటావు. ఆ బిడ్డకు ఏసు అని పేరు పెట్టాలి. ఏసు అంటే రక్షకుడు అని అర్థం. మరియమ్మ దేవదూత మాటలపై విశ్వాసంతో దేవుడిని ప్రార్థించింది. అనంతరం పరిశుద్ధ ఆత్మతో గర్భం దాల్చింది. ఇదే విషయాన్ని మరియకు ప్రదానం చేసిన యోసేబుకు కూడా దేవదూత కనపడి మరియమ్మ పరిశుద్ధ ఆత్మతో గర్భం ధరించింది. ఆమెకు పుట్టే బిడ్డ పరిశుద్ధ ఆత్మయై దేవుని కుమారుడు అనబడును. ఆయన తన ప్రజలందరిని వాళ్ళ పాపాల నుంచి రక్షిస్తాడని చెప్పాడు. దేవదూత మాటలతో యోసేబు మరియమ్మను తీసుకుని స్వగ్రామం బెత్లహేమ్‌కు బయల్దేరి వెళ్లాడు. అక్కడ వారికి ఎటువంటి వసతి దొరకనందున పశువుల పాకలో ఆశ్రయం దొరికింది. పశువుల పాకలోనే మేరి ఏసుకు జన్మనిచ్చింది. ఆ సమయంలో ఆకాశం నుంచి దేవదూత దిగివచ్చి గొర్రెల కాపరులు మీ కొరకు బెత్లహేమ్‌లో పశువుల పాకలో రక్షకుడు పుట్టాడు. ఆయనే ప్రభువైన ఏసుక్రీస్తు ఆయనే మీ అందరికి ప్రభువు. బెత్లహేమ్‌లో పశువుల తొట్టిలో పొత్తిగుడ్డలతో చుట్టి మరియతో ఉంటాడు. అతడే లోకరక్షకుడు అని దేవదూత చెప్పింది. ఆ గొర్రెల కాపర్లు ఏసుపుట్టిన చోటుకు వెళ్లి ఆయనను ఆరాధిస్తారు. ఏసుపుట్టిన రోజునే క్రిస్మస్ పండుగగా జరుపుకుంటారు.

క్రీస్తు ప్రేమను ఆచరణలో చూపడమే క్రిస్మస్




ఏసుక్రీస్తు ప్రేమను ఆచరణలో చూపడమే నిజమైన క్రిస్మస్. సమస్త ప్రాణులతో స్నేహభావం దయ కలిగిన వాడు ఏసు ప్రభు. ఏసుక్రీస్తు 2024 ఏళ్ల క్రితం భూమిపై సంచరించి సర్వమానవాళికి తన ప్రేమను పంచారు. ఆ మహనీయుని పవిత్ర పేమ, దయ, శాంతిని అందరం ఆచరణలో చూపిన పుడే నిజమైన క్రిస్మస్ ఆనందం కలుగుతుంది. బైబిల్‌లోని ప్రభువు చెప్పిన ప్రవచనాల్లో ప్రేమ, కరుణ, దయను అనుసరించడం ద్వారానే ప్రపంచంలో ప్రేమ, సామరస్యాలు సాధ్యమవుతాయి. ఆనందరకరమైన భూమిపై క్రీస్తు జన్మించినప్పుడే ఈ లోకానికి నిజమైన వెలుగు వచ్చింది. ఏసుక్రీస్తు ఎవరి జీవితాల్లో ప్రవేశిస్తే వారిలో వెలుగు నిండుతుంది. శాంతి, ప్రేమ, కరుణకు చిహ్నంగా నిలిచేదే క్రిస్మస్. మనుషుల్లో మాలిన్యాన్ని వెలికి తీసి సమాజాన్ని సంస్కరించేందుకు వచ్చినవాడే ఏసుప్రభువు. ఆయన చూపిన మార్గంలో ప్రజలంతా పయనించాలి.

ఎం.జ్యోతిరాజు, పాస్టర్, మన్నా చర్చ్


ఉండి ఎస్ఆర్‌పి.అగ్రహారం ట్రినిటి లూథరన్ చర్చి


విద్యుత్ కాంతుల్లో ఆకివీడు పెదపేటలోని బాప్టిస్ట్ చర్చి


విద్యుత్ కాంతుల్లో ఆకివీడు పెదపేటలోని బాప్టిస్ట్ చర్చి


పాలకొల్లు పట్టణంలో లాకుల వద్ద ముస్తాబైన చర్చి


ఉండి చర్చిలో క్రిస్మస్ ట్రీ, స్టార్

చర్చిలలో సందడి

● ఏలూరు రూరల్: గ్రామాల్లో క్రిస్మస్ స్టార్స్, ట్రీ ఏర్పాటు చేసి వివిధ రంగులతో కూడిన చెట్లకు ముస్తాబు చేశారు. చర్చిల వద్ద ఏసుక్రీస్తు జనన ఘట్టాలను ప్రదర్శించారు. మంగళవారం రాత్రి నుంచే ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభించారు. సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు.

● ఆకివీడు: పట్టణంలో చర్చిలు సుందరంగా తీర్చిదిద్దారు. పెదపేటలో ఆంధ్రా టౌన్, సెంట్రల్, హోప్, ఉల్వర్ధన్‌పేట యునైటెడ్, ఎల్ఈఎఫ్, వారపుసంత గాస్పల్ బాప్టిస్ట్ చర్చిలు, మాదివాడ సీబీసీఎన్‌సీ, మేరీమాత ఆర్‌సీఎం, బైపాస్‌రోడ్డు ఇమ్మాన్యుయేల్ ప్రార్థనా మందిరం, జవహర్‌పేట విశ్వాసుల ప్రార్థన సహవాసం, గాంధీనగర్ మిని స్త్రీస్ చర్చిలను విద్యుత్ దీపాలతో ఆలంకరించారు. ఇళ్లు, కాలనీల్లో క్రిస్మస్ స్టార్స్ ఏర్పాటు చేశారు.

● పాలకొల్లు అర్బన్: పట్టణంలో చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. లాకుల వద్ద, క్రిస్టియన్ పేట, శంభునిపేట, బేత్లహం పేట, మార్కు పేట, పెదపేట, వడ్లవానిపేట, బద్దావాని పేట తదితర ప్రాంతాల్లో చర్చిలను రంగురంగుల విద్యుత్ దీపాలతో స్టార్స్ అలంకరించారు. క్రిస్మస్ ట్రీలకు గిఫ్ట్ బాక్సులు తయారు చేస్తున్నారు.

● మొగల్తూరు: కొండావారిపాలెం, పాలపర్తి వారిపేట లూథరన్ చర్చిలు, ఆర్‌సీఎం చర్చిలు విద్యుత్ దీపాలంకరణ చేశారు. గ్రామాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నారు. క్రైస్తవులు, మహిళలు వేకువజామునే హల్లెలూయ, క్రీస్తు నేడు పుట్టెను నినాదాలతో ర్యాలీ చేస్తున్నారు.

● పోలవరం: మండలంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. యడ్లగూడెం వలీవల ప్రార్థనా మందిరం, ప్రభుత్వ జూనియర్ కళాశాల మార్గంలో సీయోను ప్రార్థనా మందిరం, కర్మేలు బైబిలు మిషను ప్రార్థనా మందిరాలలో ప్రార్థనలు నిర్వహించారు. పలుచోట్ల సెమీ క్రిస్మస్ సందర్భంగా అన్నదానాలు నిర్వహించారు.

● జంగారెడ్డిగూడెం: పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం ఆవరణలో క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని భారీ సెట్టింగ్ వేశారు. బాల ఏసుక్రీస్తు, మరియ, యోసేబు, పశువుల పాక, దేవ దూతలు, ఏసుక్రీస్తును పూజించడానికి వచ్చిన జ్ఞానులను ప్రతిబింబించే సెట్ వేశారు. శాంతాక్లాజ్ గిటార్ వాయిస్తున్న బొమ్మలు, క్రిస్మస్ ట్రీ విశేషంగా ఆకర్షిస్తున్నాయి.

● ఆచంట: మండలంలో చర్చిలను విద్యుత్‌దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. కొన్ని రోజులుగా ఆయా చర్చిలలో క్రిస్మస్ వేడుకలు వేడుకగా జరుగుతున్నాయి. బుధవారం జరిగే క్రిస్మస్ సందర్భంగా ఆయా చర్చిలు వద్ద సందడి నెలకొంది. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేపట్టారు.

● ఉండి: మండలంలోని చర్చిలు విద్యుత్ వెలుగులు విరజిమ్ముతున్నాయి. ఎస్ఆర్‌పి అగ్రహారంలోని ట్రినిటి లూథరన్ చర్చిలో మంగళవారం రాత్రి, బుధవారం ఉదయం పండుగను చేసుకోనున్నారు. ఉండి పెదపేట చర్చి విద్యుత్ లైట్లతో అలంకరించారు. ఇళ్ల వద్ద క్రిస్మస్ స్టార్స్, క్రిస్మస్ ట్రీలు ఏర్పాటుచేసుకున్నారు.

● తాడేపల్లిగూడెం రూరల్: పట్టణంలోని పలు పాఠశాలల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారుల కరుణామయుడు స్కిట్ అలరించింది. ఈ క్రిస్మస్‌లో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.


భీమవరం రూపాంతర చర్చిలో బాలల ప్రదర్శన


ఆచంటలో క్రిస్మస్ ప్రార్థనలకు ముస్తాబైన చర్చి


తాడేపల్లిగూడెం పట్టణంలోని పాఠశాలలో విద్యార్థుల ప్రదర్శన


భీమవరంలోని కళాశాలలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన


తణుకులో క్రిస్మస్ కేక్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి


తాడేపల్లిగూడెంలో క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి


పెనుగొండ సెమీ క్రిస్మస్ వేడుకలో ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ


భీమవరంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు, శాసనమండలి చైర్మన్ మోషేన్‌రాజు

క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యేలు

తాడేపల్లిగూడెం అర్బన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కిస్మస్ పండుగ అందరి జీవితాలలో వెలుగులు నింపాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆకాంక్షించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద క్రిస్మస్ వేడుకలను ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి సమక్షంలో మంగళవారం నిర్వహించారు. ఆర్డీవో ఖతీబ్‌కౌసర్‌బనో, మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు పాల్గొన్నారు.

● తణుకు: ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని చర్చిలకు 450 కేకులు మంగళవారం అందజేశారు. నెల రోజుల నుంచి క్రైస్తవులు క్రీస్తు బోధనలతో అందరి కోసం ప్రార్థిస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కలగర వెంకట కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

● పెనుగొండ: క్రీస్తు సంఘం, బైబిల్ ఓపెన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, డాక్టర్ కలిదిండి రామచంద్రరాజు, అన్నపూర్ణమ్మ పాల్గొన్నారు. నక్కా వినోద్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కె.ఉపేంద్ర క్రిస్మస్ సందేశం ఇచ్చారు.

● భీమవరం టౌన్: పట్టణంలోని ప్రధాన చర్చిలలో మంగళవారం సాయంత్రం నుంచి పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రకాశంచౌక్‌లోని రూపాంతర దేవాలయంలో క్రిస్మస్ వేడుకల్లో శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు ముఖ్యఅతిథులు పాల్గొన్నారు. క్రిస్మస్ కేక్ కట్ చేశారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.


మండవల్లి మండలం గన్నవరం ఆయుష్మాన్ భారత్ హెల్త్ సెంటర్‌లో గోడపై జగన్ ఫొటో

గన్నవరం హెల్త్ సెంటర్‌లో జగన్ ఫొటో

మండవల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కూటమి అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అవుతున్న ప్రభుత్వ కార్యాలయాల్లో చాలాచోట్ల నేటికీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఫొటోలే దర్శనమిస్తున్నాయి. ఏలూరు జిల్లా మండవల్లి మండలం గన్నవరంలోని ఆయుష్మాన్ భారత్ హెల్త్ సెంటరు వద్ద నవరత్నాల లోగోతో మాజీ ముఖ్యమంత్రి జగన్ ఫొటో ఉండడం విశేషం. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రస్తుత ముఖ్యమంత్రి ఫొటో కాకుండా మాజీ ముఖ్యమంత్రి ఫొటోలు కనిపించేలా ఉంచడంపై కూటమి నాయకులు అధికారుల బాధ్యతారాహిత్యంపై ధ్వజమెత్తుతున్నారు.

చిన వెంకన్న ఆలయ

నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.6 లక్షల విరాళం


దాత కుటుంబానికి విరాళం రసీదు అందజేస్తున్న సూపరింటెండెంట్

ద్వారకాతిరుమల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): చినవెంకన్న నిత్యాన్నదాన ట్రస్టుకు దాత మంగళవారం రూ.6లక్షల విరాళం అందించారు. బెంగళూరుకు చెందిన కాళీచరణ్ బస్వా విరాళాన్ని చెక్ రూపంలో జమచేశారు. ఆలయ సూపరింటెండెంట్ హయగ్రీవ దాత కుటుంబానికి శ్రీవారు, అమ్మవార్ల ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం శ్రీవారి శేషవస్త్రంతో సత్కరించారు.

నందమూరు గరువు ఆంజనేయ ఉత్సవాలు



వీరవాసరం (భీమవరం టౌన్) డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నందమూరుగరువులోని శ్రీరామ భక్త ఆంజనేయ స్వామి ఆలయ మహోత్సవాలు ఈనెల 13 నుంచి నిర్వహిస్తున్నారు. 13 రోజుల పాటు సాగిన ఉత్సవాలు బుధవారంతో ముగియనున్నాయి. ఈ సందర్భంగా ఆలయం వద్ద దాతల సహకారంతో అఖండ అన్న సమారాధనకు ఏర్పాట్లు చేశారు. రాత్రి 8 గంటలకు సత్యహరిశ్చంద్ర నాటకం ప్రదర్శనతో ఉత్సవాలు ముగుస్తాయి. ఆలయం, పరిసరాల్లో విద్యుత్ దీపాలంకరణ ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

లేసు అల్లికలపై డాక్యుమెంటరీ

రెండు రోజులుగా నరసాపురంలో నేషనల్ జియోగ్రాఫిక్ చానల్ షూటింగ్



లేసు ట్రేడింగ్ సెంటర్‌లో షూటింగ్ సందడి

నరసాపురం టౌన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): లేసు ప్రాముఖ్యతను ప్రపంచ వ్యాప్తంగా తెలియజేసేందుకు నేషనల్ జియోగ్రాఫిక్ చానల్ మంగళవారం రుస్తుంబాదాలోని లేసు ట్రేడింగ్ సెంటర్‌లో షూటింగ్ నిర్వహించారు. ముంబాయి నుంచి మోడల్స్‌ను రప్పించి కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. సాయంత్రం ఎల్‌బీచర్ల కలవకొలను తాతాజీ లేసు కంపెనీల్లో కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. రెండు రోజులుగా మార్కెట్, లేసు పార్కుల్లో పలు షాట్‌లను షూట్ చేశారు. అల్లికలు దేశానికి ఎలా వచ్చాయి? ఎలా ప్రాచుర్యం పొందాయి? విదేశాల ఎగుమతి తదితర అంశాలను ప్రజలకు తెలియజేయాలన్న లక్ష్యంతో ఈ చానల్ బయోఫిక్ (డాక్యుమెంటరీ) రూపొందిస్తున్నది. 40ఏళ్ళ క్రితం నరసాపురం ప్రాంతానికి చెందిన ఒక లేసు కుటుంబం ముంబాయి వెళ్లి స్థిరపడుతుంది. మళ్లీ చాలా ఏళ్ల తరువాత ఆ కుటుంబానికి చెందిన ఒక మహిళ ఈ ప్రాంతానికి వచ్చి లేసు వస్తువుల్ని కొనుగోలు చేస్తుంది. అనే కథాంశం మీద ఈ డాక్యుమెంటరీని రూపొందిస్తున్నట్టు చిత్ర యూనిట్ చెప్పింది. ఈ షూటింగ్‌కు కావాల్సిన లోకేషన్లు, లేసు వస్తువులను లేసు ట్రేడ్ కన్వీనర్ కలవకొలును తులసీరావ్ సమకూర్చుతున్నారు.

కేబుల్ ఆపరేటర్ల సమస్యలు పరిష్కరిస్తా

ఏపీ రాష్ట్ర ఫైబర్‌నెట్ చైర్మన్ జి.వెంకటరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరెడ్డి

పెంటపాడు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కేబుల్ ఆపరేటర్ల సమస్యలన్నీ పరిష్కరిస్తానని ఏపీ రాష్ట్ర ఫైబర్‌నెట్ చైర్మన్ జి.వెంకటరెడ్డి తెలిపారు. సమస్యల పరిష్కారానికి కొంత సమయం పడుతుందని కేబుల్ అపరేటర్లు కొంత ఓపిగ్గా ఉండాలన్నారు. మంగళవారం పెంటపాడు ఆర్యవైశ్య కళ్యాణమండపంలో ఉమ్మడి పచ్చిమగోదావరి జిల్లా కేబుల్ ఆపరేటర్లతో నిర్వహించిన సమావేశంలో చైర్మన్ వెంకటరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేబుల్ ఆపరేటర్లు తాము ఎదుర్కొంటున్న సమస్యలను వెంకటరెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. కేబుల్ ఆపరేటర్లపై విధించిన విద్యుత్ పోల్ రెంటల్ చార్జీలను రద్దు చేయాలని, కొత్త సెటప్ బాక్స్‌లు, ఓఎల్‌టీలను అందించడంతో పాటు సర్వీసింగ్ సెంటర్లను ఏర్పాటు చేయాలి తదితర విషయాలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనికి స్పందించిన వెంకట రెడ్డి తాను చైర్మన్ అయిన నాటి నుంచి ప్రతి జిల్లాలో పర్యటించి కేబుల్ ఆపరేటర్ల సమస్యలను తెలుసుకుంటున్నానని, ప్రతి సమస్య కూడా పరిష్కారం చేయడం సాధ్యమేనన్నారు. కేబుల్ అపరేటర్లను ఇబ్బందుకు గురి చేసిన ఉద్యోగులపై కూడా చర్యలు తీసుకుంటున్నామని, ఇప్పటి వరకు 410 మంది ఉద్యోగులపై చర్యలు తీసుకున్నామని ఇంకా 210 మందిని గుర్తించడం జరిగిందన్నారు. కేబుల్ ఆపరేటర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రావు పాల్గొన్నారు.

మూడు చక్రాల వాహనం ఇప్పించండి



పెనుగొండ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పెనుగొండ మండలం ములపర్రు గ్రామానికి చెందిన వేంద్ర మోహనరావు(53) వాహన ప్రమాదంలో కాళ్ళకు దెబ్బలు రెండు కాళ్లు తొలగించారు. ఇతనిది నిరుపేద కుటుంబం. సామాన్య కూలి పని చేసుకుని జీవిస్తాడు. ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబానికి పెద్ద దిక్కు అయిన యజమానికి రెండు కాళ్లు తొలగించడంతో కుటుంబం రోడ్డున పడింది. దాతలుగాని ప్రభుత్వంగాని ముందుకువచ్చి మూడు చక్రాల వాహనం ఇప్పించాలని కోరుతున్నారు.

పేదల బియ్యం రీసైకిల్ చేస్తే ఉపేక్షించం: జేసీ



రైస్‌మిల్లులో తనిఖీలు చేస్తున్న జేసీ రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్డీవో కౌసన్ భనో

తాడేపల్లిగూడెం రూరల్ డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పేదలకు ప్రభుత్వం అందిస్తున్న బియ్యం రీసైకిల్ చేసేవారిని ఉపేక్షించబోమని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. తాడేపల్లిగూడెం మండలం కుంచనపల్లిలోని శ్రీ శ్రీనివాస అగ్రిప్రాడక్ట్స్ ఇండియా లిమిటెడ్ రైస్‌మిల్లులో ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మిల్లులో ఉన్న నిల్వలు, ఏ రిజిస్టర్‌లో ఉన్న నిల్వలు, బీ రిజిస్టర్‌లో ఉన్న నిల్వలను పరిశీలించారు. ఓ గదిలో ఉన్న గోనె సంచులను పరిశీలించారు. రైస్‌మిల్ యజమాని గ్రంధి ప్రసాద్‌కు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో ఖతిఫ్ కౌసర్ భనో, తహసీల్దార్ ఎం.సునీల్ కుమార్ పాల్గొన్నారు.

పెళ్లి చేసుకుంటానని మోసం..

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): భర్తతో విడాకులు తీసుకుని విడిగా ఉంటున్న మహిళను పెళ్ళి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన వ్యక్తిపై బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్‌కె.జబీర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని శ్రీనివాసపురం గ్రామానికి చెందిన బొల్లి పాము మంగతాయారు బ్యాండు మేళంలో సింగర్‌గా జీవనం సాగిస్తున్నది. ఆమెకు ఎనిమిది సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. ఒక బాబు ఉన్నాడు. కొంతకాలానికి భర్తతో మనస్పర్థలు కారణంగా విడాకులు ఇచ్చి విడిగా ఉంటున్నట్లు తెలిపారు. కొంతకాలం క్రితం అదే గ్రామానికి చెందిన యడ్లపల్లి మంగ రాజు అనే వ్యక్తి మంగతాయారును ప్రేమిం చానని, పెళ్లి చేసుకుంటానని చెప్పి ఆమెతో సంబంధం పెట్టుకున్నాడు. అనంతరం బాధితురాలు తనను పెళ్ళి చేసుకొమ్మని అడగడంతో మంగరాజు నిరాకరించాడు. అనంతరం ఈ నెల 17వ తేదీన బాధితురాలు ఇంటికి వెళ్ళి ఆమెను కొట్టి సోషల్ మీడియాలో ఇద్దరూ కలిసి దిగిన ఫోటోలను పెడతానని బెదిరించాడన్నారు. ఈ విషయాన్ని గ్రామ పెద్దలలో పెట్టగా అక్కడ న్యాయం జరగకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

1న సినీ పాటల పోటీలు

పెనుగొండ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆదర్శ రైతు రంకిరెడ్డి వీరన్న సత్యవతి జ్ఞాపకార్థం ఉభయతెలుగు రాష్ట్రాల స్థాయి సినీ పాటల పోటీలను మహర్షి సత్యవతేయ విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్టు పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ రంకిరెడ్డి రామ్మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలు ఇరగవరం మండలం ఐతంపూడిలో జనవరి 1వ తేదీన రెండు గంటల నుంచి ప్రారంభమవుతున్నట్లు తెలిపారు. ప్రథమ విజేతకు రూ.5 వేలు , ద్వితీయ విజేతకు రూ.3 వేలు, తృతీయ విజేతకు రూ.2 వేలు ఉంటాయని వివరించారు. పూర్తి వివరాలకు కన్వీనర్, చివటం సుబ్బారావు 9849528590 నెంబరుకు ఫోన్ చేయాలని కోరారు.

జగనన్న కాలనీ లే అవుట్‌పై విజిలెన్స్ విచారణ

ముసునూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ముసునూరులో సంధ్యవాగు వద్ద వేసిన జగనన్నకాలనీ లే అవుట్‌పై మంగళవారం విజిలెన్స్ అధికారులు విచారణ చేశారు. ఈ సందర్భంగా రైతులు రేగుల గోపాలకృష్ణ, రేగుల లోకేశ్వరావులతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి అనిల్‌కుమార్ సమావేశమై వివరాలను సేకరించారు. ఇళ్ల స్థలాలకు మీకు ఇష్టప్రకారమే భూమి ఇచ్చారా, ప్రభుత్వ నుంచి భూమికి నగదు చెల్లింపులు జరిగాయా, ఎందుకు ఇచ్చిన భూమికి తిరిగి నగదు చెల్లిస్తామని అంటున్నారు, మీకు వచ్చిన ఇబ్బందులు ఏమిటి అని విజిలెన్స్ అధికారి రైతులను అడిగారు. వీటిపై రైతులు మాట్లాడుతూ తమ ఇష్టప్రకారమే ఇళ్ల స్థలాలకు 7.08 ఎకరాల భూమిని ఇచ్చామని, దీని నిమిత్తం ప్రభుత్వం రూ.కోటి 41 లక్షలు చెల్లించిదన్నారు. అయితే గ్రామానికి 4కిలో మీటర్ల దూరంలో లే అవుట్ ఉండటంతో లబ్ధిదారులు అక్కడకు వెళ్ళేందుకు నిరాకరించారని, అందుకనే ప్రభుత్వానికి తిరిగి నగదును కట్టి భూమి తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నట్లు రైతులు చెప్పారు. దీనిపై గత ప్రభుత్వంలో ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్‌కు సుమారు ఐదుసార్లు వినతపత్రాలు ఇచ్చామని, ప్రస్తుత నూజివీడు శాసన సభ్యులు, రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రికి కూడా ఇటీవల వినతపత్రం ఇచ్చినట్లు వారు తెలిపారు.

వైద్యశాఖకు అవినీతి రోగం



- ఐదు కీలక విభాగాలకు ఒక్కరే దిక్కు!
- జిల్లా అధికారి మిలాఖత్‌పై ప్రచారం
- వైద్యాధికారులపై వేధింపులు
- ఉద్యోగులకు అక్రమ డిప్యుటేషన్లు
- షాడో వైద్యాధికారికి కొత్త డీఎంహెచ్‌వో చికిత్స తప్పనిసరి

: జిల్లా వైద్యఆరోగ్యశాఖలో అవినీతిపర్వం తారాస్థాయికి చేరింది. ప్రభుత్వ ప్రాధామ్యాల్లో కీలకమైనశాఖగావున్న ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ జిల్లా పరిధిలో ఓ సాధారణ వైద్యాధికారిగా ఉద్యోగ ప్రవేశంచేసిన ఓ జూనియర్ మెడికల్ ఆఫీసర్ షాడో డీఎంహెచ్‌వోగా వ్యవహరిస్తుండటం చర్చనీయాంశమైంది. సంబంధితశాఖ జిల్లా అధికారి అండదండలతో జిల్లాలోని పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లపై పెత్తనంచేస్తుండటం, నెలవారీ మామూళ్ళను నిర్దేశించడం, నిర్ణీత నగదు టార్గెట్లు ముట్టజెప్పనివారిని ఏదోఒక విషయంలో విచారణలపేరుతో వేధిస్తుండటం పరిపాటిగా మారిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పీహెచ్‌సీలకు వచ్చే గర్భిణులకు పురుడుపోయకుండా ఏదోఒక వైద్యకారణాన్ని సాకుగా చూపించి స్థానికంగావున్న ఓ కార్పొరేట్ ఆసుపత్రికి రిఫర్ చేయాల్సిందిగా వైద్యాధికారులపై ఒత్తిడిచేయడం, సహకరించని మెడికల్ ఆఫీసర్లపై కక్షసాధింపులు కొంతకాలంగా తీవ్ర మయ్యాయని సమాచారం. తన వెనుక ఓ ఎమ్మెల్యే ఉన్నందున తననేమీ చేయలేరంటూ జిల్లా అధికారి అండదండలతో ఆ మెడికల్ ఆఫీసర్ అక్రమాలకు తెగబడుతున్నారు.

ఏలూరు అర్బన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్యఆరోగ్యశాఖలో చేపట్టే అన్ని కార్యకలాపాలు, ఉద్యోగులు, మెడికల్ ఆఫీసర్లకు విధుల కేటాయింపు, వారి సర్వీసుల పర్యవేక్షణ, ప్రైవేటు ఆస్పత్రులకు అనుమతులు, వాటి కార్యకలాపాల పరిశీలన తదితర అంశాలపై డీఎంహెచ్‌వోకు సహకరించేందుకు పరిపాలన విభాగం, ఎఫ్‌డీపీ, ఎఫ్‌ఆర్‌ఎస్ అటెండెన్స్, ఐడీఎస్‌పీ, పారామెడికల్ విభాగం తదితర సెక్షన్లు ఉంటాయి. ఈ విభాగాలన్నింటికీ వేర్వేరుగా వైద్యాధికారులు, అధికారులు, పర్యవేక్షకులు ఉండాలి. కాని వీటన్నింటికీ కలిపి ఒకరికే ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడం, అందులోనూ కాంట్రాక్టు ప్రాతిపది కన నియమితులైన ఓ మెడికల్ ఆఫీసర్ తన ప్రొబేషన్‌కాలంలో పలు ఆరోపణలు, విధుల నిర్వహణలో బాధ్యతారాహిత్యం, కొవిడ్ సంక్షోభ రోజుల్లో నిబంధనలకు విరుద్ధంగా ఏకంగా వంద రోజుల పాటు విధులకు ఎగనామం పెట్టడం వంటి తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్నప్పటికీ ఏరికోరి ఏకంగా ఐదు విభాగాలకు బాధ్యతలు అప్పగించడం వెనుక జిల్లా అధికారి మిలాఖత్ కావడమేనని ప్రచారం జరుగుతోంది. కీలకమైన ఈ ఐదు విభాగాలకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించడానికి కనీసం కలెక్టర్ నుంచి అనుమతి కూడా తీసుకోకుండానే నియామకాలు జరిగిపోవడం విశేషం. పీజీ వైద్యవిద్య ప్రవేశాల్లో ఇన్‌సర్వీస్ కోటాకోసం రాష్ట్రవ్యాప్తంగా పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లు ఇటీవల పదిరోజులపాటు చేసిన సమ్మెలో పాల్గొన్నవారిలో కొందరిని టార్గెట్‌గా చేసుకుని వేధింపు చర్యల్లో భాగంగానే ఈ ఐదు విభాగాలకు ఒకరినే నియమించినట్టు మరో ప్రచారం ఉంది. జిల్లా వైద్యఆరోగ్యశాఖలో 'వసూల్ రాజా'గా పేరొందిన అతడిని తన రెండో అవతారంగా జిల్లా అధికారి నియమించుకుని యథేచ్ఛగా స్వలాభం పొందుతున్నట్టు సమాచారం. తనపట్ల ఆ మెడికల్ ఆఫీసర్ చూపిస్తోన్న వీరవిధేయతకు లబ్ధిచేకూర్చే క్రమంలో ప్రొబేషన్ పీరియడ్‌లో పెట్టిన వందరోజుల సెలవు పీరియడ్‌ను క్రమబద్ధీకరించేందుకు రాష్ట్ర కార్యాలయానికి కొద్దిరోజుల క్రితమే ప్రతిపాదనలను పంపించడం గమనార్హం. వాస్తవానికి జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో కీలక విభాగాల కార్యకలాపాలను పర్యవేక్షించేందుకు ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో నియమించిన నలుగురు మెడికల్ ఆఫీసర్లు ప్రత్యేకంగా ఉండగా, అవసరమనుకుంటే వీరికి సంబంధిత ఐదు విభాగాల బాధ్యతలను అప్పగించడం లేదా ఇతరులకు అప్పగించవచ్చు. దీనికి భిన్నంగా జిల్లా కేంద్రానికి చేరువగావున్న ఓ పీహెచ్‌సీకి నియమితులైన మెడికల్ ఆఫీసర్‌ను డబ్బులు బాగా దండుకునే దారులున్న ఐదు విభాగాలకు నియమించడాన్ని నిశితంగా పరిశీలిస్తే ...జిల్లాలో ఆ మెడికల్ ఆఫీసర్‌కుమించి సమర్థులెవరూ లేరా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దీనికితోడు పీహెచ్‌సీ లేదా ఆ ఐదు విభాగాల్లో విధులు నిర్వర్తించాల్సిన సమయంలో స్థానికంగావున్న ఓ ప్రైవేటు ఆస్పత్రిలో నిబంధనలను తుంగలోతొక్కి డ్యూటీ మెడికల్ ఆఫీసర్‌గా పనిచేస్తుండటాన్ని సంబంధిత ఆస్పత్రి సీసీ టీవీల ఫుటేజ్‌ను పరిశీలిస్తే ఇట్టే అక్రమాలు దొరికిపోతాయని ప్రచారం జరుగుతుండటం గమనార్హం.

అడ్డగోలు డిప్యుటేషన్లకు కళ్లెం ఎపుడో..

జిల్లాలోని వివిధ పీహెచ్‌సీల నుంచి డీఎంహెచ్‌వో కార్యాలయానికి ఫార్మసిస్టులు, సీనియర్ అసిస్టెంట్లు, ఎంపీహెచ్‌ఈవోలు, అటెండర్లు తదితర కేడర్లలో సుదూర ప్రాంతాల నుంచి అక్రమ డిప్యుటేషన్లు వేసినట్టు తెలుస్తోంది. ఏజెన్సీ మండలాలతోపాటు, పోతునూరు, కె.గోకవరం, చేబ్రోలు, చాటపర్రు, పెదవేగి, కాగుపాడు, ధర్మాజీగూడెం, గొల్లపల్లి, దొరమామిడి తదితర పీహెచ్‌సీలతోపాటు, ఏలూరు పీపీ యూనిట్‌వంటిచోట్ల వైద్యసేవల నిర్వహణలో కీలక బాధ్యతలు నిర్వర్తించాల్సినవారిని డీఎంహెచ్‌వో కార్యాలయానికి డిప్యూటేషన్లు ఇవ్వడానికి కనీసం కలెక్టర్ అనుమతులు కూడా లేవని సమాచారం. ఆ మెడికల్ ఆఫీసర్‌ను, మరికొందరిని జిల్లావైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో కొనసాగించేందుకు జిల్లాలోని సుదూరప్రాంతాల పీహెచ్‌సీల వైద్యాధికారులను డిప్యూటేషన్లపై వేయడంవల్ల ఆయా పీహెచ్‌సీల్లో వైద్యసేవలకు విఘాతం కలుగుతోందన్న విమర్శలున్నాయి. పీహెచ్‌సీల తనిఖీలకు ఓ ఎంపీహెచ్‌ఈవో, అటెండర్ స్థాయి వ్యక్తులతోకూడిన బృందం వెళుతుండటం, మామూళ్ళు వసూలు చేసుకురావడం ఆ అక్రమార్కుడు, జిల్లా అధికారి అండదండలే కారణమని తెలుస్తోంది. మెడికల్ లీవులను హాజరుపట్టీలో నమోదు చేసే విషయంలోను, తిరిగివారంతా విధుల్లో చేరేటపుడు సమర్పించాల్సిన ఫిట్‌నెస్ సర్టిఫికెట్ విషయంలోను అడ్డదారులు జరుగుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇక ప్రైవేటు ఆస్పత్రులకు అనుమతులు, తనిఖీలకు కాంట్రాక్టు ఉద్యోగులే నేరుగా వెళ్ళడం, మామూళ్ళు తెచ్చుకోవడం షరామామూలేనని సమాచారం. ఈ నేపథ్యంలో కొత్తగా బాధ్యతలు చేపట్టిన డీఎంహెచ్‌వో డాక్టర్ మాలిని తన శాఖలో వేళ్ళూనుకున్న అక్రమాలకు, అడ్డగోలు నియామకాలకు చెక్ పెట్టాల్సిన ఆవశ్యకత ఉంది.

క్రైమ్ కార్నర్

ఆ మహిళ ఎవరు?

గాలిస్తున్న పోలీసులు

ఉండి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): యండగండిలో నాగతులసి ఇంటికి మృతదేహాన్ని పార్శిల్ చేసిన ఘటనలో పోలీసులు పురోగతి సాధిస్తున్నారు. ప్రధాన నిందితుడు ముగ్గురు మహిళలకు భర్త అయిన శ్రీధర్ వర్మ (సుధీర్)ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మృతదేహాన్ని పార్శిల్ చేసిన ఘటనలో కీలకంగా వ్యవహరించిన మహిళ కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఇప్పటికీ ఆమె ఆచూకీ లభ్యం కాలేదు. సుధీర్ వర్మ మూడో భార్య పార్శిల్ చేయడంలో సహకరించారని పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే ఈమె కూడా పోలీసులకు చిక్కలేదు. తన వద్ద పనిచేసిన వ్యక్తినే హత్యచేసి పార్శిల్ చేసిన సుధీర్ వర్మ పోలీస్ కస్టడీలో ఉన్నాడు. విచారణ చేపడుతున్నారు. పార్శిల్‌లో సహకరించిన మహిళ ఆచూకీ లభ్యమైన తర్వాత కేసు వివరాలను పోలీసులు వెల్లడించే అవకాశం ఉంది.

కిరాణా వ్యాపారి అదృశ్యం

ఏలూరు క్రైం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పెదపాడు మండలం కొత్తూరు గ్రామానికి చెందిన గవ్వాది శ్రీనివాసరావు (46) కిరణా వ్యాపారం చేస్తూ ఉంటాడు. ఈనెల 23వ తేదీన కిరణా సరుకులను ఏలూరు వెళ్ళి తీసుకువస్తానని కుటుంబ సభ్యులకు చెప్పి ఏలూరు వచ్చాడు. ఏలూరు కొత్తబస్టాండ్‌లోని మోటారు సైకిల్ పార్కింగ్ షెడ్డులో మోటారు సైకిల్ పెట్టినట్లు ఆ గ్రామస్తులు చూశారు. అతను ఎంతకీ రాకపోవడంతో అతనిభార్య ఫోన్ చేయగా స్విచ్‌ఆఫ్ రావడంతో ఆందోళనకు గురై ఏలూరు త్రి టౌన్ పోలీసులకు బుధవారం రాత్రి ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్సపొందుతూ రైతు మృతి

లింగపాలెం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గడ్డి ట్రాక్టర్ ఢీకొని రైతు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లింగపాలెం శివారు బుల్లావారిగూడెంకు చెందిన మొలుగుమాటి తిరపతయ్య (53) ఈనెల 16వ తేదీన ట్రాక్టర్‌లో గడ్డి తోలుకువచ్చాడు. గడ్డివాము వద్ద డ్రైవర్ ట్రాక్టర్‌ను వెనుకకు పెడుతుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ వెనుక చక్రాల కింద పడి తీవ్ర గాయాలపాలవ్వడంతో వెంటనే చికిత్స నిమిత్తం ఏలూరులో ఆసుపత్రికి తీసుకువెళ్లారు. మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ తీసుకు వెళ్లగా చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మరణించినట్లు పోలీసులు తెలిపారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కె. వెంకన్న తెలిపారు.

మద్యానికి డబ్బు ఇవ్వలేదని దాడి

మొగల్తూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మద్యానికి డబ్బులు ఇవ్వలేదని కొట్టి గాయపర్చిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ జి.వాసు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 20వ తేదీన పేరుపాలెం నార్త్ గ్రామానికి చెందిన అడబాల శ్రీనివాస్‌ను అదే గ్రామానికి చెందిన అడబాల మణికంఠ మద్యం దుకాణం వద్ద డబ్బులు అడిగాడు. డబ్బులు ఇవ్వకపోవడంతో శ్రీనివాస్‌ను కొట్టి గాయపర్చాడు. నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో శ్రీనివాస్ చికిత్స పొందుతూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

పనిచేస్తున్న ఫైనాన్స్ కంపెనీకే టోకరా

మేనేజర్‌తో పాటు మరో ఉద్యోగి రూ.25 లక్షల మోసం

కైకలూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ఫైనాన్స్‌లో నమ్మకంగా పనిచేస్తూ ప్రజలకు రుణాలు ఇప్పిస్తానని వారి ఆస్తి పత్రాలపై రుణాలు పొంది కంపెనీని మోసం చేసిన మోసగాళ్లను కైకలూరు టౌన్ సీఐ పి.కృష్ణ అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. కైకలూరులోని కీర్తన ప్రైవేటు ఫైనాన్స్‌లో పనిచేస్తున్న ఇద్దరు రుణాల పేరిట మోసగించి రూ.25 లక్షలు తమ జేబులో వేసుకుని చివరకు కటకటాలపాలయ్యారు. కైకలూరు పరిసర ప్రాంతాల్లో 10 మంది సభ్యులు సొసైటీగా ఏర్పడితే తమ సంస్థ నుంచి రుణాలు అందిస్తామని ప్రజలను మోసం చేశారు. అదే బ్రాంచిలో మేనేజర్‌గా పనిచేస్తున్న రుద్రపాటి సూర్యం అదే బ్రాంచిలో పనిచేస్తున్న రుద్రపాటి స్కైలాబ్ ప్రజల ఆస్తులను వారి సొంత ఆస్తులుగా పెట్టి రూ.25 లక్షలు వరకు రుణాలు పొందారు. అనంతరం వారిద్దరు ఉద్యోగాలు మానివేసి వేరొక సంస్థలో ఉద్యోగాల్లో చేరారు. వీరు పనిచేసిన కాలంలో ఫైనాన్స్ కంపెనీలో తీసుకున్న రుణాలపై ఈ ఈ నెల 13వ తేదీన సంస్థ నిర్వాహకులు జరిపిన తనిఖీల్లో మోసం బయటపడింది. దీంతో కైకలూరు టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సూర్యంను అదుపులోకి తీసుకోగా ఏ-2 అయిన స్కైలాబ్ న్యాయస్థానంలో లొంగిపోయాడు. వీద్దరిని కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించడంతో మచిలీ పట్నం జిల్లా జైలుకు తరలించారు. అయితే వీరు చేసిన మోసం సుమారు రూ.40లక్షలకు పైబడి ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ ఫైనాన్స్‌లో రుణాలు పొందిన ఖాతాదారులు ఈ విషయం తెలిసి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నంబర్ ప్లేట్ లేని వాహనాలపై స్పెషల్ డ్రైవ్



నెంబర్ ప్లేట్‌ను దగ్గరుండి బిగింప చేయిస్తున్న సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ మదీనాబాషా

ఏలూరు క్రైం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నెంబర్ ప్లేటు లేని ద్విచక్రవాహనాలపై ఏలూరు వన్‌టౌన్ పోలీసులు బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పలువురికి జరిమానాలు విధించారు. ఏలూరు వన్‌టౌన్ సీఐ జీ సత్యనారా యణ, ఎస్‌ఐ మదీనాబాషా వారి సిబ్బందితో కలిసి స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించారు. నెంబర్ ప్లేటులేని వాహనాలను పార్కింగ్‌లో ఉన్నా గుర్తించి సంబంధిత యజమానిని ఆ వాహనానికి సంబంధించిన రవాణాశాఖ జారీ చేసిన నెంబర్ ప్లేటును తీసుకురావాలని చెప్పి, తీసుకువచ్చిన తరువాత దానిని బిగింపచేయించిన తరువాతే వాహనాన్ని ఇచ్చారు. నెంబర్ ప్లేట్లు తేలేని 40 మందికి జరిమానాలు విధించారు. హెల్మెట్ లేకుండా వాహనాలను నడిపితే జరిమానాలు విధిస్తామంటూ వాహనదారులకు అవగాహన కల్పించారు. హెల్మెట్లు ధరించని ఐదుగురిపై కేసులు నమోదు చేశారు.

వృద్ధురాలిని బెదిరించి నగలు దోచుకున్న వ్యక్తి అరెస్టు



నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

ఏలూరు క్రైం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వృద్ధురాలిని బెదిరించి బంగారు ఆభరణాలు దోచుకున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు పెదవేగి సీఐ కె వెంకటేశ్వరరావు తెలిపారు. పెదపాడు మండలం కొక్కిరపాడు గ్రామానికి చెందిన గుండె సరోజిని (72) నవంబర్ 14వ తేదీ మధ్యాహ్నం ఆమె మనుమడు కలపర్రు టోల్‌గేటు సమీపంలో ఉన్న కొక్కిరపాడు క్రాస్ రోడ్డు వద్ద సాయిబాబాగుడికి మోటారుసైకిల్‌పై తీసుకువచ్చి దించి వెళ్ళిపోయాడు. ఆమె తిరిగి ఇంటికి వెళ్ళడానికి రైల్వే గేటు వరకు వచ్చి కొక్కిరపాడు గ్రామం వెళ్ళడానికి నిలబడి ఉంది. కృష్ణాజిల్లా ఉంగుటూరు మండలం తేలప్రోలు గ్రామానికి చెందిన రేమల్లి సునీల్‌కుమార్ (36) హోండాయాక్టివ్ స్కూటర్ వేసుకుని ఆమె వద్దకు వచ్చి ఆమె వేసుకున్న నగలను చూశాడు. అవి ఎలాగైనా తస్కరించాలని ఆలోచించుకుని తాను కొక్కిరపాడు గ్రామం వెళ్తున్నాని దింపుతానని నమ్మబలికి ఆ వృద్ధురాలిని తన స్కూటర్ ఎక్కించుకున్నాడు. మార్గమధ్యలో ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ దగ్గరలోని జాతీయ రహదారి పక్కనే ఉన్న ఆదిత్య ఖాళీ ప్లాటులోకి తీసుకువెళ్ళి ఆమెపై దాడిచేసి గాయపర్చి మెడలో ఉన్న నాంతాడు, మరో చైను, నాంతాడుకు ఉన్న లాకెట్, ముక్కుకు ఉన్న బంగారు ముక్కు పుడకను తీసుకుని ఆమెను వదిలేసి పరారీ అయ్యాడు. ఈ సంఘటనపై బాధితురాలు పెదపాడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ కె శారదాసతీష్ కేసు నమోదు చేశారు. జాతీయ రహదారిపై సీసీ ఫుటేజీలను పరిశీలించి నిందితుడి ఆన వాళ్ళను గుర్తించారు. దీంతో అతనిని మంగళ వారం మధ్యాహ్నం అప్పనవీడులో పశువుల సంతదగ్గర అరెస్టు చేశారు. అతని నుంచి మూడు లక్షల 36 వేల రూపాయల విలువైన బంగారు వస్తువులు, నేరానికి ఉపయోగించిన హోండాయాక్టీవా మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు.

పేకాట స్థావరంపై దాడి

30 మంది అరెస్టు
రూ.8 లక్షల పది వేలు స్వాధీనం

ఏలూరు క్రైం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : తంగెళ్ళమూడి ఎస్‌ఎంఆర్ నగర్‌లోని ఒక ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు ఏలూరు రూరల్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్‌ఐ సీహెచ్ దుర్గా ప్రసాద్ తన సిబ్బందితో దాడి నిర్వహించారు. అక్కడ పేకాట ఆడుతున్న 30 మందిని అరెస్టు చేసి 8 లక్షల 10 వేల రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఏలూరుకు చెందిన ఒక రాజకీయ నాయకుడు పేకాట నిర్వహిస్తున్నట్లుగా గుర్తించారు. వివిధ జిల్లాలకు చెందిన పేకాటరాయుళ్ళు ఇక్కడ ఉన్నారు.

బాలికను పెళ్లి చేసుకున్న యువకుడి అరెస్టు

ముదినేపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మైనర్ బాలికను వివాహం చేసుకున్న ఘటనపై నమోదైన కేసులో నిందితులైన ఇద్దరు యువకులను సోమవారం రాత్రి డీఎస్పీ శ్రావణ్ కుమార్ అరెస్టు చేశారు. అల్లూరుకు చెందిన బి.రోహిత్ అనే యువకుడు ఈనెల 5న 17 ఏళ్ల మైనర్ బాలికను తన స్నేహితుల సహాయంతో వేరే చోటకు తీసుకెళ్లి వివాహం చేసుకున్నాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ వీరభద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. కోమర్రు గ్రామం వద్ద రోహిత్‌తో పాటు పెళ్లి చేసుకునేందుకు అతనికి సహకరించిన బి.పవన్ కుమార్‌ను డీఎస్పీ శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో అరెస్టు చేసి మంగళవారం కైకలూరు కోర్టులో హాజరుపర్చగా, నిందితులకు మెజిస్ట్రేట్ రిమాండ్ విధించారు.

ప్రేమించలేదని.. యువకుడి ఆత్మహత్య

ముదినేపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తన ప్రేమను ఓ యువతి తిరస్కరించిందన్న మనస్థాపంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలివి.. ముదినేపల్లి మండలం చినపాలపర్రుకు చెందిన పూసల అజయ్ బాబు (19) రోజువారీ కూలి పనులకు వెళ్తుం టాడు. కొంతకాలంగా ఒక యువతిని ప్రేమిస్తున్నాడు. అయితే ఆ యువతి అతని ప్రేమను అంగీకరిం చలేదు. ఈ క్రమంలోనే మనస్థాపానికి గురై ఈ నెల 22న చేవూరు గ్రామం వద్ద పురుగు ముందు తాగాడు. అజయ్ కుటుంబసభ్యులకు స్థానికులు సమాచారం అందించగా వెంటనే గుడివాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. తండ్రి వెంకట సుబ్బారావు ఫిర్యాదు మేరకు అనుమానాస్పద కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ వీరభద్రరావు తెలిపారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్‌కె.జబీర్ తెలిపారు. శ్రీనివాసపురం గ్రామానికి చెందిన బొబ్బిలి భాగ్య ప్రియను అదే మండలం కృష్ణంపాలెం గ్రామానికి చెందిన కిరణ్ రెండేళ్ళ క్రితం వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక పాప ఉంది. ఈ నెల 24 వ తేదీ భాగ్యప్రియ తన భర్త కిరణ్ వేరొక మహిళతో దిగిన ఫొటోలను తన సెల్ ఫోన్ ద్వారా చూపించగా భర్త కోపంతో ఆమె తలను గోడకు కొట్టి చంపుతానని బెదిరించాడు. అంతే కాకుండా కిరణ్ తన భార్యకు వేరే వ్యక్తితో వివాహేతర సంబంధం అంటగట్టి వేధించాడన్నారు. ఈఘటనపై భార్య ఫిర్యాదు మేరకు భర్త కిరణ్ అతనికి సహకరించే మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రైతులకు సహకార సంఘాలు సేవలందించాలి : పితాని


ఆచంటలో గొడౌన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ

ఆచంట/పెనుమంట్ర, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రైతాంగానికి సహకార సంఘాలు విస్తృత సేవలందించాలని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ కోరారు. మంగళవారం ఆచంట సొసైటీకి సంబంధించి రూ.40 లక్షలు నాబార్డు సొసైటీ నిధులతో నిర్మించిన ఎంపీఎఫ్‌సీ గొడౌన్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రానున్న ఆరు నెలల్లో సహకార సంఘాలకు సంబంధించి ఎన్నికలు నిర్వహించేందుకు సీఎం చంద్రబాబునాయుడు ఆలోచిస్తున్నారన్నారు. జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు, సిద్ధాంతం డీసీ ఛైర్మన్ తమ్మినీడి ప్రసాద్, సొసైటీ కార్యదర్శి యాండ్ర విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

హిందూ దేవాలయాల పవిత్రత కాపాడాలి..

హిందూ దేవాలయాల పవిత్రతను కాపాడాలని, దేవుళ్లకు దీప ధూప నైవేద్యాల విషయంలో పర్యవేక్షణ కొరవడిందని చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. మంగళవారం పోడూరు మండలం కొమ్ముచికాలలో దేవదాయ, ధర్మదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ కార్యనిర్వహణాధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వారం రోజుల్లో దేవాలయాల ధర్మకర్తల మండలి నోటిఫికేషన్ విడుదల కానుందని, వెంటనే దరఖాస్తుల స్వీకరించి ధర్మకర్తల మండలి సభ్యులను నియామకం చేపట్టాలని కోరారు. జిల్లా దేవదాయ శాఖ అధికారి ఈవీ సుబ్బారావు, డీఈఈ వీకే పైడి, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ వి.వెంకటేశ్వరరావు, ఈవోలు, తదితరులు పాల్గొన్నారు.

రాయలంలో ప్రతి ఇంటికి కుళాయి వేయిస్తాం : అంజిబాబు


అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం రూరల్/వీరవాసరం(భీమవరం టౌన్) డిసెంబరు 24 (ఆంధ్ర జ్యోతి) : రాయలం గ్రామంలో ప్రతి ఇంటికి మంచినీటి కుళాయి వేయిస్తామని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. రాయలం గ్రామంలో రూ.40 లక్షలతో రెండు మైక్రో ఫిల్టర్ వాటర్ ట్యాంకులు, రూ.12లక్షలతో పార్క్, రూ.17.60 లక్షలతో సీసీ రోడ్డును ఆయన మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. రాయలం గ్రామాన్ని మోడ్రన్ ప్రాంతంగా అభివృద్ధి చేశామని, ఇక నుంచి స్వచ్ఛమైన తాగు నీరును అందిస్తామన్నారు. టీడీపీ రాష్ట్ర నాయకులు కోళ్ళ నాగేశ్వరరావు, పొత్తూరి బాపిరాజు, రాయలం జనరల్ సెక్రటరీ పత్తి హరివర్దన్, టౌన్‌హాల్ అధ్యక్షుడు కోళ్ళ రామచంద్రరావు, యర్రంశెట్టి శివకృష్ణ, ఇందుకూరి రామలింగరాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాలే లక్ష్యం

గ్రామాలకు మౌలిక సదుపాయాల కల్పనలో కూటమి లక్ష్యమని ఎమ్మెల్యే రామాంజనేయులు అన్నారు. వీరవాసరం మండలం నందమూరి గురువు, మడుగు పోలవరం, మత్స్యపురిపాలెంలో సుమారు రూ.52 లక్షలతో రోడ్డు పనులకు, మత్స్యపురిపాలెంలో రూ.40 లక్షలతో మైక్రో ఫిల్టర్ వాటర్ ట్యాంకు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఎంపీపీ దుర్గాభవాని, కూటమి నాయకులు పాల్గొన్నారు.

'వినియోగదారుడు ప్రతి వస్తువుకు బిల్లు తీసుకోవాలి'

భీమవరంటౌన్, డిసెంబరు 24 (ఆంధ్ర జ్యోతి) : వినియోగదారులు కొనుగోలు చేసిన ప్రతి ఒక్క వస్తువుకి తప్పనిసరిగా బిల్లును పొందాలని జిల్లా రెవెన్యూ అధికారి మొగిలి వెంకటేశ్వర్లు సూచించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన వినియోగదారుల రక్షణ చట్టంపై అవగాహన కల్పించి మాట్లాడారు. వినియోగదారులు ఏదైనా వస్తువు కొన్నప్పుడు తప్పనిసరిగా రసీదు పొందాలని సూచించారు. బిల్లు పొంది ఉంటే ఆ వస్తువు సరైనదిగా లేనప్పుడు అమ్మకందారుడిని డిమాండ్ చేసేందుకు దోహదపడుతుందన్నారు. వినియోగదారుల సంక్షేమం కోసం 24 డిసెంబరు 1986లో మొట్టమొదటిసారిగా వినియోగదారుల రక్షణ చట్టం కార్యరూపందాల్చిందన్నారు. అనంతరం డీఆర్వో చేతుల మీదుగా వినియోగదారుల దినోత్సవంలో భాగంగా నిర్వహించిన వ్యాస రచన, వక్తృత్వ పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందించారు. డీఎస్‌వో ఎన్.సరోజ, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డీఎం టి.శివరామప్రసాద్, జిల్లా పౌరసరఫరా శాఖ ఏఎస్ఓ ఎం.రవిశంకర్, డీటీవో ఈ.నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావం విజయవంతం చేయాలి

పాలకొల్లు అర్బన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విజయవాడ వద్ద గన్నవరం సమీపంలోని కేసవరంలో హిందూ సంఘాలు జనవరి ఐదో తేదీన నిర్వహిస్తున్న హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయాలని ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ, బీజేపీ నాయకులు కోరారు. మంగళవారం పాలకొల్లు పట్టణంలో ప్రచార కార్యక్రమం నిర్వహించి, సంబంధిత పోస్టర్‌ను క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఈ సభకు విచ్చేసే వారి కోసం పట్టణంలోని గాంధీ బొమ్మల సెంటర్ నుంచి బస్సులు ఏర్పాటు చేశామన్నారు. కేవీఎస్ నరసింహరాజు 98482 11134, బోడా సత్యజిత్‌కుమార్ 98481 74647, చెరుకూరి శ్రీనివాసరావు 98495 82022 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు జక్కంపూడికుమార్, నరసింహరాజు, సత్యజిత్ కుమార్, ములుకుట్ల రవీంద్ర, ఎస్.ఆనం దక్షిష్ణ, బి.శ్రీరామ్, నాళం బాబి, డి.మోహన్ కుమార్, సీహెచ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధిగ్రస్తులకు వసుధ ఫౌండేషన్ ఆర్థిక సాయం

పాలకొల్లు అర్బన్, డిసెంబరు 24 (ఆంధ్ర జ్యోతి): వసుధా ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట రామరాజు పంపిన రూ.20వేలు చెక్కును అల్లవరం మండలం గోడిలంక గ్రామానికి చెందిన రుద్రరాజు సూర్యకాంతంకు, అదేవిధంగా కిడ్నీ వ్యాధిగ్రస్తుడు రెల్లుగడ్డ గ్రామానికి చెందన నడింపల్లి సత్యనారాయణ రాజుకు రూ.20వేలు చెక్కును ఫౌండేషన్ సభ్యులు బుధవారం బుద్ధరాజు నివాసంలో అందజేశారు. సూర్యకాంతంకు కొంతకాలంగా కాలి కండరాల వద్ద రక్తం గడ్డకట్టిపోవడంతో అపరేషన్ అవసరం కావడంతో ఈ విషయాన్ని ఏరియా కన్వీనర్ పి.బుద్ధరాజు చైర్మన్ వెంకటరామరాజు దృష్టికి తీసుకువెళ్ళడంతో చెక్కును పంపినట్టు తెలిపారు. రుద్దరాజు సత్యనారాయణరాజు, గ్రామ సర్పంచ్ రుద్రరాజు పవిత్ర లక్ష్మీపతిరాజు, వేగిరాజు సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

'బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అభినందనీయం'

పాలకొల్లు అర్బన్, డిసెంబరు 24 (ఆంధ్ర జ్యోతి): స్థానిక సంస్థల్లో బీసీలకు వున్న 24శాతం రిజర్వేషన్లను కూటమి ప్రభుత్వం 34 శాతానికి పెంచడం అభినందనీయం అని బీసీ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనమాలి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు కోడె యుగంధర్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో రాష్ట్ర కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ గణేష్ భవానీ అధ్యక్షతన జాతీయ బీసీ సంక్షేమ సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య ఆశీస్సులతో సంఘ పటిష్టతకు నిరంతరం కృషి చేస్తామన్నారు. పలువురు వక్తలు మాట్లాడుతూ బీసీ హాస్టల్స్‌లో మెస్ చార్జీలు పెంచాలన్నారు. బీసీ సంక్షేమ సంఘం నాయకులు వింజరపు శంకరం, కోరుకొండ సుబ్బారావు, తమ్మిరి వెంకటేశ్వరరావు, నీలంశెట్టి సత్యప్రసాద్, వి.దుర్గారావు, వి.కృష్ణ, వందలాపు శ్రీనివాసరావు, పలు బీసీ కులాల సంఘ నేతలు పాల్గొన్నారు.


పరీక్షలు చేస్తున్న డాక్టర్ రమేష్‌చంద్రబాబు

ఉచిత వైద్య సేవలు

తణుకు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత బీపీ, సుగర్ పరీక్షల శిబిరం నిర్వహించారు. సంఘ కార్యాలయంలో డాక్టర్ బి.రమేష్‌చంద్రబాబు పరీక్షలు చేసి రిపోర్టులను అందజేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు ఈదర ప్రసాదరావు, కోసూరి గాంధీ, జిల్లా అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ, ఇవటూరి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురి జూదరులపై కేసులు

పెంటపాడు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పెంటపాడు బజార్ రోడ్డులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై రూరల్ సీఐ రమేష్ ఆధ్వర్యంలో దాడి చేశామని ఏఎస్ఐ రాజేంద్ర తెలిపారు. రూ.16 వేలు నగదు స్వాధీనం చేసుకుని ఆరుగురు వ్యక్తులపై కేసులు నమోదు చేశామన్నారు.

27న చాంబర్స్ కాలేజీలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

పాలకొల్లు అర్బన్, డిసెంబరు 24 (ఆంధ్ర జ్యోతి) : స్థానిక చాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో ఈనెల 27న దివిస్ లేబరేటరీస్ ఆధ్వర్యంలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ డి. వెంకటేశ్వరరావు తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఉంటాయని, బీఎస్సీ, బీటెక్, ఎంఎస్సీ, బి-ఫార్మసీ, ఎం-ఫార్మసీల్లో ఉత్తీర్ణులై 21-25 ఏళ్ళ మధ్య వయస్సు గల అభ్యర్థులు అర్హులన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ. 18,000 నుంచి 24,000 వరకు వేతనం, ఉచిత వసతి, భోజనం. వివరాలకు 99120 46234 నంబరులో సంప్రదించాలన్నారు.

విద్యార్థికి రూ.20 వేలు సాయం

భీమవరంటౌన్, డిసెంబరు 24 (ఆంధ్ర జ్యోతి) : ప్రతిభ గల పేద విద్యార్థులకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని తుమ్మలపల్లి మంగరాజు ట్రస్టు చైర్మన్ తుమ్మలపల్లి శివ అన్నారు. భీమవరంలో బీడీఎస్ చదువుతున్న విద్యార్థికి శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో దాతలను సమీకరించి రూ.20 వేలు ఆర్థిక సహాయాన్ని అందించే కార్యక్రమాన్ని తుమ్మలపల్లి మంగరాజు ట్రస్టు కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు.


పోడూరు తహసీల్దార్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న తహసీల్దార్ ఫాజిల్


గొల్లలకోడేరు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చిన్నారుల నృత్యాలు


గణపవరం క్రిస్మస్ వేడుకల్లో మాట్లాడుతున్న సర్పంచ్ అలంకారం


క్రిస్మస్ తాతతో తణుకు మాంటిస్సోరి స్కూలు డైరెక్టరు అనపర్తి ప్రకాశరావు

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

» పాఠశాల, కాలేజీల్లో ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

పోడూరు/గణపవరం/తాడేపల్లిగూడెం రూరల్, డిసెంబరు 24 (ఆంధ్ర జ్యోతి) : అప్పన్నచెర్వు శివారు సబ్బేవానిపేటలో క్రీస్తు మందిరంలో సెమీ క్రిస్మస్ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు నిర్వహించిన కళాప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. జిన్నూరు చాకిరేవుగుంట ప్రార్థన మందిరంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎస్ఎం.ఫాజిల్ క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. సూపరింటెండెంట్ జి.కృపరాజు, ఆర్.రాంబాబు, దాసరి రత్నరాజు, పెదపాటి లక్ష్మీపెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు. గణపవరం ప్రభుత్వ ఆసుపత్రిలో సెమీ క్రిస్మస్ వేడుక నిర్వహించారు. ప్రభుత్వ వైద్యాధికారి సంతోష్‌నాయుడు, పిప్పర ప్రభుత్వ వైద్యాధికారి కె.ప్రియాంక, సర్పంచ్ మూరా అలంకారం తదితరులు పాల్గొన్నారు. తాడేపల్లిగూడెం లూథరన్ చర్చిలో షెమిదా రత్నాకర్ ప్రారంభ ప్రార్థన చేయగా సండే స్కూల్ యూవత్ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ముగింపు ప్రార్థనలు రెవరెండ్ డీఎల్ ఫినేహాస్ నిర్వహించారు.

పాఠశాల, కాలేజీల్లో..

పాలకొల్లు అర్బన్/తణుకు/భీమవరం రూరల్/పాలకోడేరు/పెనుగొండ : పాలకొల్లు దీప్తి హైస్కూల్లో విద్యార్థులు దేవదూత, క్రిస్మస్ తాత వంటి వేషధారణలతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. స్కూల్ డైరెక్టర్ ఆర్‌వీ అప్పారావు, ప్రిన్సిపాల్ నూకల లలితారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. నారాయణ స్కూల్లో ముందస్తు క్రిస్మస్ పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు. ప్రిన్సిపాల్ తులసీ వెంకటేష్ మాట్లాడుతూ క్రీస్తు జన్మదినం విశిష్టతను తెలిపారు. తణుకు మాంటిస్సోరి స్కూలులో చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. స్కూల్ డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. భీమవరం పట్టణంలోని శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాలలో క్రిస్మస్ వేడుకలను కళాశాల డైరెక్టర్ ఎం.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎ.అనురాధ మాట్లాడుతూ జీసస్ క్రైస్ట్ జీవన శైలి మనకు స్ఫూర్తిదాయకమన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మావుళ్ళు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బ్రహ్మం, కళాశాల ఏవో సురేష్ తదితరులు పాల్గొన్నారు.పాలకోడేరు మండలం భీమవరం శివారు గొల్లలకోడేరు గ్రామంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో పాఠశాల ఛైర్మన్ వత్సవాయి శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రిన్సిపాల్ కృష్ణారావు, టీచర్స్ పాల్గొన్నారు. పెనుగొండ భాష్యం పాఠశాలలో విద్యార్థులు పశువుల పాకను ఏర్పాటు చేసి గీతాలాపనలు చేశారు. ప్రిన్సిపాల్ ఎస్.వెంకట అప్పారావు విద్యార్థులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. భాష్యం జోనల్ ఇన్‌చార్జి ఎ.శ్రీమన్నారాయణరెడ్డి, చాంప్స్ ఇన్‌చార్జి రానిరోజాజి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్‌వీఎస్ వీఈసీ ప్రిన్సిపాల్‌గా రామచంద్రరావు

వీరవాసరం,భీమవరంటౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వీరవాసరం ఎస్‌వీఎస్ వీఈసీ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా చింతగుంటు రామచంద్రరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన నారాయణపురంలోని మహాత్మా గాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సివిక్స్ అధ్యాపకుడిగా పనిచేస్తూ పదోన్నతిపై వీరవాసరం వచ్చారు. ఆయనను పలువురు అభినందించారు.

రాష్ట్రస్థాయి ఉపన్యాస పోటీల్లో డీఆర్‌జీ విద్యార్థిని ఫస్ట్

పెంటపాడు, డిసెంబరు 24 (ఆంధ్ర జ్యోతి) : జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ఉపన్యాస పోటీలలో పెంటపాడు డీఆర్ గోయింకా ప్రభుత్వ కళాశాల విద్యార్థిని కుసుమాంజలి ప్రథమ స్థానంలో నిలిచి రూ.7 వేలు నగదు, ప్రశంసాపత్రాన్ని అందుకుందని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. జిల్లాస్థాయిలో నిర్వహించిన ఉపన్యాస, వ్యాసరచన పోటీలలో విద్యార్థులు కె.సత్యఐశ్వర్య, కుసుమాంజలి ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ టీఎస్ఎన్. ప్రసాద్, రమామాధురి, జేవీ మధుకుమార్, ఎంఎల్. మల్లిక, కె.పిచ్చియ్య అభినందనలు తెలిపారు.

రేపు సీపీఐ శత వసంతాల సభ జయప్రదం చేయాలి

భీమవరం అర్బన్, డిసెంబర్ 24 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ శత వార్షికోత్సవాల్లో భాగంగా ఈనెల 26న భీమవరంలో జరగనున్న ప్రదర్శన, బహిరంగ సభల్లో కార్మిక వర్గం, శ్రమజీవులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. మంగళవారం బుధవారం మార్కెట్ వద్ద జరిగిన భీమవం ఒకటో డివిజన్ మున్సిపల్ కార్మికుల సీపీఐ శాఖ సమావేశం సీపీఐ జిల్లా సమితి సభ్యుడు కిలారి మల్లేశ్వరరావు అధ్యక్షత నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాటాడుతూ సీపీఐ ఆవిర్భావం జరిగి వందేళ్లవుతున్న సందర్భంగా సీపీఐ శత వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించాలని, ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించి చరిత్రను వివరించాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెల్లబోయిన రంగారావు, సీపీఐ జిల్లా సమితి సభ్యుడు యేలేటి విజయానంద్ పాల్గొన్నారు.

సూర్యచంద్రరావు మృతి


సూర్యచంద్రరావు (ఫైల్)

నరసాపురం టౌన్, డిసెంబరు 24 (ఆంధ్ర జ్యోతి): పట్టణానికి చెందిన పెరుమాళ్ళ సూర్యచంద్రరావు(78) మంగళవారం హఠాన్మరణం చెందారు. ఆయన రాష్ట్ర రేషన్ డీలర్ల సమైక్య కార్యదర్శి, జిల్లా కోశాధికారి, మండల రేషన్ డీలర్ల కార్యదర్శిగా పని చేశారు. ఆయన మృతికి ప్రభుత్వ విప్ నాయకర్, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, ఆర్డీవో దాసిరాజు, తహసీల్దార్ రాజరాజేశ్వరి, సీపీఐ నాయకులు నెక్కంటి సుబ్బారావు, టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, కొవ్వలి నాయుడు, జిల్లా డీలర్ల సంఘం అధ్యక్షుడు ఆధికారి ఏసు, అత్మూరి వెంకటనరసయ్య, సమయమంతుల సర్వేశ్వరరావు, కె.అనంత సత్య వెంకటసుబ్బారావు తదితరులు పార్థీవ దేహాన్ని సందర్శించి సంతాపం తెలిపారు.

యండగండి కాలేజీ విద్యార్థినులకు బహుమతులు

ఉండి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జాతీయ వినియోగదారుల దినోత్సవం పురస్కరించుకుని జిల్లా స్థాయిలో జరిగిన ఇంగ్లీషు వ్యాసరచన పోటీల్లో యండగండి జూనియర్ కళాశాల విద్యార్థినులు తృతీయ బహుమతులను గెలుచుకున్నారు. మంగళవారం భీమవరం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో యండగండి జూనియర్ కళాశాల విద్యార్థినులు కె.బాలజ్యోతి, జి.షారోన్‌కుమారి రూ.1500 చొప్పున నగదు, బహుమతులు అందుకున్నట్టు తెలిపారు. వీరిని వినియోగదారుల సంఘం నాయకులు బొబ్బిలి బంగారయ్య, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రమ్య, తాడి పెద్దిరాజు తదితరులు అభినందించారు.

తాడేపల్లిగూడెంను రెండో రాజధానిగా తీర్చిదిద్దుతా

» ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి, వలవల బాబ్జి, జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

తాడేపల్లిగూడెం రూరల్/నరసాపురం రూరల్/ఉండి/పోడూరు, డిసెంబరు 24 (ఆంధ్ర జ్యోతి): తాడేపల్లిగూడెం పట్టణాన్ని జిల్లాలోనే రెండో రాజధానిగా తీర్చిదిద్దుతానని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. మాధవరంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో లాండ్ టైటలింగ్ యాక్టు పేరుతో వేలాది ఎకరాలు అన్యాక్రాంతం చేసేందుకు జగన్ స్కెచ్ వేశాడని దానికి నిదర్శనమే మాధవరం రెవెన్యూ సదస్సులో బయటపడిన 98 ఎకరాల భూమి రికార్డుల్లో లేకపోవడంగా చెప్పుకోవచ్చన్నారు. ఎర్రకాలువ గట్ల పటిష్టతకు ప్రభుత్వం రూ.9.85 కోట్లు విడుదల చేసిందన్నారు. ఆ పనులు మేం ప్రారంభించినా నాణ్యతను రైతులే దగ్గరుండి పర్యవేక్షించాలన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందని అన్ని సమస్యలు త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. అనంతరం జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. సర్పంచ్ ముప్పిడి సూర్యకుమారి, ఉపసర్పంచ్ బండారు నాగరాజు తదితరులు పాల్గొన్నారు. నరసాపురం మండలం దర్బరేవు గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆర్డీవో దాసిరాజు మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కరించేందుకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం ఫిర్యాదులు స్వీకరించారు. ఉండి మండలం అర్తమూరు, కలిగొట్ల గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో తహసీల్దార్ నాగార్జున మాట్లాడుతూ ఇప్పటి వరకు ఉండి మండలంలో 84 అర్జీలు వచ్చాయన్నారు. పోడూరు మండలం పండిత విల్లూరులో తహసీల్దార్ ఎస్ఎం. ఫాజిల్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సుకు పలువురు రైతులు అర్జీలు అందజేశారు.

పేదల ఇళ్ల తొలగింపు నిర్ణయం తగదు : జక్కంశెట్టి

పాలకోడేరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కొద్దిమంది ప్రయోజనాల కోసం గత 39 ఏళ్లగా నివాసముంటున్న పేదల ఇళ్ల తొలగింపు నిర్ణయం తగదని ఏపీ వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ అన్నారు. మంగళవారం పాలకోడేరు శివారు అల్లూరి సీతారామరాజు నగర్‌లో ఇళ్లను సందర్శించి మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పేదల ఇల్లు కూల్చే కొత్త మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసి దానికి ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుని మంత్రిగా నియమించాలని విమర్శించారు. ఎవరైనా పేదల ఇళ్ల జోలికొస్తే కోర్టు ధిక్కరణ కేసులకు గురికావాల్సి వస్తుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శేషపు అశ్రియ్య మాట్లాడుతూ అనేక పోరాటాలు చేసి సౌకర్యాలు కల్పించుకుంటే ఇప్పుడు ఇళ్ల కూలుస్తామని భయపడేది లేదని గుర్తుచేశారు. అనంతరం ఇళ్ల స్థలాల పోరాట సాధన కమిటీ ఏర్పాటు చేశారు. కమిటీ కన్వీనర్‌గా పెచ్చెట్టి సత్యనారాయణ, సభ్యులుగా నాగవరపు ఈశ్వరి, పాలా లక్ష్మి, మల్లుల నాగలక్ష్మి, వేల్పూరి దుర్గ, తమ్మినేని వెంకటలక్ష్మి, జోగి నాగరాజు, సంపదరావు, భాస్కరరావు, తనపల త్రిమూర్తులు, నాగవరపు కొండలరావు ఎన్నికయ్యారు.

ఇంటి పన్ను చెల్లించకపోతే నోటీసులు


సిబ్బందికి సూచనలు చేస్తున్న కమిషనర్ అంజయ్య

నరసాపురం టౌన్, డిసెంబరు 24 (ఆంధ్ర జ్యోతి): సకాలంలో ఇంటి పన్ను చెల్లించని వారికి నోటీసులు జారీ చేస్తామని కమిషనర్ అంజయ్య హెచ్చరించారు. మంగళవారం పట్టణంలో పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. పెండింగ్‌లో ఉన్న ఇంటి బకాయిదారుల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను ప్రజలు పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలన్నారు. బకాయిదారులు చెల్లించని పక్షంలో నోటీసులతో పాటు మైక్ ప్రచారం చేస్తామన్నారు. సచివాలయాల్లో త్వరితగతిన పెండింగ్ ఇంటి పన్ను బకాయిలను చెల్లించాలన్నారు. ఆర్ఐ నానాజీ, సిబ్బంది పాల్గొన్నారు.


కరాటే పోటీల్లో బహుమతులు సాధించిన విద్యార్థులు

కరాటే పోటీల్లో విద్యార్థులకు బహుమతులు

తణుకు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన కె.ఎస్.మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 21, 22వ తేదీల్లో ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో బెనారస్ హిందూ యూనివర్శిటీ ఇండోర్ స్టేడియంలో 9వ జాతీయ కరాటే పోటీలలో తమ విద్యార్థులు బహుమతులు సాధించారని అకాడమీ చైర్మన్ డాక్టర్ కె.శ్రీనివాసు తెలిపారు. 11 మంది విద్యార్థులు గోల్డ్ మెడల్, ప్రథమ, ద్వితీయ స్థానాల్లో ఆరుగురు, తృతీయ స్థానంలో ముగ్గురు విద్యార్థులు బహుమతులు సాధించారన్నారు. బహుమతులు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు.

31లోగా పీఎం కిసాన్ గడువు

నరసాపురం రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఆర్‌బీకేల వద్ద రైతులు పీఎం కిసాన్‌కు సంబంధించిన ఇన్సూరెన్స్‌ను ఈనెల 31లోపు కట్టుకోవాలని వ్యవసాయశాఖ ఏడీఈ డాక్టర్ అనిల్‌కుమారి తెలిపారు. ఎకరానికి రూ.615 చొప్పున కట్టి ఇన్సూరెన్స్ చెల్లించాలన్నారు. దీనివల్ల అకాల వర్షాలు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంటకు ఇన్సూరెన్స్ పొందవచ్చన్నారు. ప్రస్తుతం సబ్ డివిజన్ పరిధిలో నాలుగు వేల మంది రైతులు ఉన్నారన్నారు. కౌలుదారులు ఇన్సూరెన్స్ కట్టుకోవచ్చన్నారు. ఈనెలాఖరుకు ఎక్కువ మంది రైతుల చేత కట్టించే విధంగా సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామన్నారు.

ఇరిగేషన్ స్థలం పరిశీలన

కాళ్ళ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ భవన అవసరాల కోసం పెద అమిరం మహాత్మా గాంధీ క్యాన్సర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ వద్ద నీటిపారుదల శాఖకు సంబంధించిన మూడున్నర ఎకరాల భూమిని సంబంధిత శాఖ అధికారులతో కలిసి జేసీ టి.రాహుల్ కుమార్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ భూమికి సంబంధించిన మ్యాపులను, స్థలాన్ని పరిశీలించారు. కలెక్టర్ కార్యాలయం నుంచి ఈ స్థలం వరకు ఎంత దూరం, పట్టణానికి ఎంత దూరముందో అధికారులను అడిగి తెలుసుకున్నారు. జేసీ మాట్లాడుతూ ప్రభుత్వ భవనాలు నిర్మాణాలకు స్థలం పరిశీలించామన్నారు. భూమి వివరాల నివేదికను అందజేయాలని అధికారులను ఆదేశించామన్నారు. ఆర్డీవో కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, జిల్లా నీటిపారుదల శాఖ అధికారి పి.నాగార్జునరావు, జిల్లా ఇన్‌ఛార్జి డ్రెయినేజీ అధికారి సీహెచ్.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.